**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-30-3, CPI(M) State Committee Office
Akulavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

**07,8 సెప్టెంబర్ 15 సిపియం రాష్ట్ర కమిటీ సమావేశాలు విజయవాడలో జరిగాయి. సమావేశాలకు రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ఆమోదించిన తీర్మానాలు, నిర్ణయాలు 08.09.2015న విజయవాడలో జరిగిన పత్రికా విలేఖరుల సమావేశంలో విడుదల చేసిన నోట్ మరియు ఫోటో, ప్రచురణార్థం పంపుతున్నాము. విలేఖరుల సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి పి.మధు, కార్యదర్శివర్గ సభ్యులు దడాల సుబ్బారావు పాల్గొన్నారు.**

# తీర్మానం

## విద్య, వైద్యం, భూములను కార్పొరేట్ల భోజ్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

విద్యను, వైద్యాన్ని, రైతుల భూములను కార్పొరేట్ రంగానికి ధారాదత్తం చేయడం ద్వారా చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రంలో కార్పొరేట్ పరిపాలన ప్రవేశపెడుతున్నదని ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన సిపిఐ(యం) రాష్ట్ర కమిటి సమావేశం విమర్శించింది. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విశాఖలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఉన్నత విద్య బాధ్యత తమది కాదనీ, దాన్ని కార్పొరేట్లు సామాజిక బాధ్యతగా తమ భుజస్కంధాలపై వేసుకోవాలని కోరారు. దానికి అనుగుణంగానే ప్రభుత్వం ప్రయివేటు యూనివర్శిటీల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపింది. పెద్ద సంఖ్యలో స్కూళ్ళు, సంక్షేమ హాస్టళ్ళ మూసివేతకు నిర్ణయించింది.

కొన్ని చోట్ల జిల్లా వైద్యశాలల్ని కార్పొరేట్లకు అప్పగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే వైద్యశాలల పారిశుద్ధ్యాన్ని ప్రయివేటు కాంట్రాక్టర్లకు అప్పగించింది. పేదలకు కార్పొరేట్ వైద్యం పేరుతో ఇతర సేవలను కూడా వారికి అప్పగించేందుకు సిద్ధం చేసింది. దీంతో ప్రజలపై తీవ్ర భారం పడుతుంది. చిత్తూరు, అనంతపురం జిల్లాల్లో మంచినీటి సరఫరాను కార్పొరేట్ కంపెనీలు తమ సిఎస్ఆర్ నిధుల ద్వారా బాధ్యత వహించాలని ప్రభుత్వం కోరింది. ఈ విధంగా ప్రజాసేవా రంగాలను కార్పొరేట్లకు అప్పగించడం ద్వారా ప్రభుత్వం తన బాధ్యతలనుండి తప్పుకోజూస్తున్నది. గిరిజన ప్రాంతాలు, మరికొన్ని జిల్లాల్లో మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలుతున్నాయి. డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బంది తగినంత మంది లేరు. మందులు కూడా అందడంలేదు. నివారణకు కనీస చర్యలు కూడా ప్రభుత్వం తీసుకోలేదు.

రాజధాని నిర్మాణం పేరుతో రైతులు, పేదలనుండి అసైన్డ్, లంక భూములతో సహా అవసరానికి మించి వేల ఎకరాలను ప్రభుత్వం సమీకరించింది. ప్రభుత్వ, అటవీ భూములతో కలుపుకుని లక్షకు పైగా ఎకరాల వరకు సిద్ధం చేసింది. భూములను కార్పొరేట్లకు కట్టబెట్టడానికి ప్రయత్నిస్తున్నది. ప్రభుత్వభూములు, పేదలు సాగుచేసుకుంటున్న భూములతో సహా మొత్తం 15 లక్షల ఎకరాలతో రాష్ట్రంలో లాండ్ బ్యాంకు ఏర్పాటు చేయడానికి జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు పంపింది. ప్రత్యేకంగా పేదలు సాగుచేసుకుంటున్న బంజరు భూములను, అసైన్డ్ భూములను గుంజుకుంటున్నది. ఫలితంగా కౌలుదార్లు, వ్యవసాయ కార్మికులు, వృత్తిదార్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ

విధానాలు సామాన్య ప్రజల సంక్షేమానికి చేటు తెస్తాయి. సిపిఐ(యం) వీటిని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ప్రజాకంటక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమం చేపట్టాలని ప్రజలకు పిలుపునిస్తోంది.

రాష్ట్రం ఈ ఏడాది కూడా తీవ్ర వర్షాభావాన్ని ఎదుర్కొంటున్నది. రాయలసీమ కరువుకోరల్లో చిక్కుకున్నది. దాదాపు సగం మండలాలు అనావృష్టి బారినబడ్డాయి. వలసలు, రైతుల ఆత్మహత్యలు పెరిగాయి. త్రాగునీటికి కూడా తీవ్ర ఎద్దడి వస్తుంది. కార్పొరేట్ సేవల్లో తరిస్తున్న ప్రభుత్వం ఈ సమస్యలపై దృష్టి సారించడం లేదు.

తీవ్రమైన నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటున్న యువత పోస్టులు భర్తీ చేయాలని అనేక చోట్ల ఆందోళనలకు దిగుతోంది. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించిన యువకులను ప్రభుత్వం అరెస్టు చేసింది. ప్రభుత్వంలోని అనేక విభాగాల్లో వేలాది పోస్టులు ఖాళీగా ఉన్నా నింపడం లేదు. మరోవైపు కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పెద్ద ఎత్తున తొలగిస్తున్నది.

నిత్యావసర ధరలు పెరిగి సామాన్య ప్రజలు అల్లాడుతున్నారు. ఉల్లిపాయలు, పప్పులు, నూనెలు పేదలకు అందుబాటులో లేకుండా పోయాయి. వీటినుండి ప్రజలకు ఉపశమనం కల్పించకపోగా ప్రభుత్వం మరిన్ని భారాలు వేయడానికి సిద్ధ పడుతోంది. ఆర్టీసి ఛార్జీలు, విద్యుత్ ఛార్జీల పెంపునకు రంగం సిద్ధం చేసింది. భారాలు పెంచడాన్ని సిపిఐ(యం) వ్యతిరేకిస్తోంది. ప్రజలకు ఉపశమనం కల్పించే చర్యలు తక్షణం తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోంది.

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కల్పించే విషయంలో కేంద్ర ప్రభుత్వ మోసపూరిత వైఖరిని సిపిఐ(యం) ఖండిస్తోంది. ఏవో సాకులు చెప్పి రాష్ట్రానికి ప్రత్యేక హోదాను నిరాకరిస్తున్న కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేలేక పోతోంది. అదేపనిగా చెబుతుఉన్న ప్రత్యేక ప్యాకేజీలు కూడా మిథ్యగానే ఉన్నాయి. రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీలు ఇవ్వాలనీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ప్రకటించాలని, విభజన సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని పార్టీ రాష్ట్ర కమిటి డిమాండ్ చేస్తున్నది.

= = = =